సాక్షి
మంచిర్యాల

గురువారం । 24 । అక్టోబర్ । 2024



బెంబేలెత్తిస్తున్న బెబ్బులి
బోథ్ మండల వాసులను పులి బెంబేలెత్తిస్తుంది. మంగళవారం చింతలబోరి, వజ్జర్ అడవుల్లో సంచరించిన టైగర్ బుధవారం గొల్లాపూర్ మీదుగా చింతగూడకు చేరుకుంది. 8లో▸



జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి 8లో▸
విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదిలాబాద్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. వాతావరణం చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్



క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్

లక్సెట్టిపేట: క్రీడల వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు ఆడడం వల్ల శారీరక, మానసికోల్లాసాన్ని పొందుతారని అన్నారు. క్రీడల్లో చూపించిన ప్రతిభతో ఉన్నత చదువుల్లో ఉపయోగం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను ఉపాధ్యాయులు వెలికితీసి ఉన్నతస్థాయికి ఎదిగేలా చూడాలని అన్నారు. అండర్–17, 19 విభాగాల్లో ఆరు రోజులపాటు క్రీడాపోటీలు కొనసాగుతాయని, ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, కళాశాలల కన్వీనర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, భాగ్యలక్ష్మి, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులను ప్రోత్సహించాలి

మంచిర్యాలఅర్బన్: వినూత్న ఆలోచనలకు వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్–2024కు ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలని డీఈవో యాదయ్య సూచించారు. ఎస్‌ఈపీ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం, నీతి ఆయోగ్, ఆటల ఇన్నోవేషన్ మిషన్, ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లో సమర్పించాలని తెలిపారు. 6నుంచి 12వ తరగతి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించాలని పేర్కొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



మంచిర్యాలటౌన్: అస్సాంలోని డిబ్రుగర్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 30వరకు జరిగే అండర్–13 జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ మెయిన్ డ్రా పోటీలకు మంచిర్యాల క్రీడాకారిణి ఆ **ఆరాధ్య** రాధ్య డబుల్స్ విభాగంలో ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల కొల్‌కతా, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి ర్యాంకింగ్ పోటీల్లో హైదరాబాద్ క్రీడాకారిణి అభజాదవ్‌తో కలిసి ఆరాధ్య పాల్గొని మంచి ప్రతిభతో జాతీయస్థాయి 21వ ర్యాంకు సాధించి, మెయిన్ డ్రా పోటీలకు ఎంపికైందని తెలిపారు. ప్రస్తుతం ఆరాధ్య హైదరాబాద్‌లోని గరుడ అకాడమీ బ్యాడ్మింటన్ కోచ్ నరేందర్ వద్ద శిక్షణ పొందుతోంది.

ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేత

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని ఐదుగురు ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఐదుగురిని సస్పెండ్ చేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. డిజిటల్ క్రాప్ సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఏఈవోలు అంగీకరించడంతో సస్పెన్షన్ ఎత్తివేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

'జిల్లా సదస్సులు విజయవంతం చేయాలి'

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో అన్ని కులాల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించే సదస్సులకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ నిరంజన్‌గౌడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని వెనుకబడిన తరగతుల కమిషన్ కార్యాలయం నుంచి కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, సభ్య కార్యదర్శి బాల మాయదేవిలతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్, వెనుకబడిన తరుగతుల సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 28న ఆదిలాబాద్‌లో నిర్వహించే సదస్సుకు అన్నికులాల ప్రతినిధులు, సంచార జాతులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను ఆహ్వానించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు.

ఎలా చేద్దాం?



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- జిల్లాలో అనధికార లే ఔట్లకు బ్రేక్
- డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్ల మంత్రాంగం
- అధిక డబ్బులు ఇచ్చేందుకూ సిద్ధం
- అయినా ముందుకు సాగని ప్రక్రియ?



డాక్యుమెంట్‌పై సంతకాలు తీసుకుని, స్టాంప్ వేసినందుకు రూ.వంద వసూలు చేస్తున్న ఆఫీసు సిబ్బంది

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో అనధికార లే ఔట్ల రిజిస్ట్రేషన్లపై తర్జనభర్జన కొనసాగుతూనే ఉంది. గత కొద్ది రోజులుగా డాక్యుమెంటు రైటర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. అధికారులు అనధికార లే ఔట్లకు రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో పాత లావాదేవీలు నిలిచి కొత్త వెంచర్లు రావడం లేదు. ఇదంతా అధిక డబ్బుల కోసమే లావాదేవీలు నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. జిల్లాలో మంచిర్యాల, లక్సెట్టిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. లక్సెట్టిపేట పరిధిలో రోజుకు ఐదు నుంచి పది రిజిస్ట్రేషన్లు మాత్రమే అవుతున్నాయి. మంచిర్యాల పరిధి పెద్దగా ఉండడంతో ఇక్కడ లావాదేవీలు అధికంగా ఉంటాయి. ఇక్కడ సెప్టెంబర్ ముందు వరకు 1200 నుంచి 1500 డాక్యుమెంట్లు అయ్యేవి. రాష్ట్ర ఖజానాకు మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే ఏడాదికి రూ.55కోట్లకు పైగా సగటున ఆదాయం సమకూరుతోంది. గత సెప్టెంబర్ నుంచి లావాదేవీలు అమాంతం తగ్గాయి. గతంలో అనధికార లే ఔట్లు రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా కొందరు అధికారులు డబ్బులకు తెగించి చేసేవారు. అప్పట్లోనే రూ.30వేలు ఇస్తే ఏ భూమి అయినా రిజిస్ట్రేషన్ చేస్తారనే తీరు నడిచేది. సర్కారు మారినప్పటి నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. దీంతో రియల్ వ్యాపారంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

'సిగ్నల్' ఇస్తే చేస్తారా?

మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికా ర పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతో ఉన్న రియల్ వ్యాపారి చేతిలో కార్యాలయం నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆయన చెప్పిన వాటికి అధికారులు ఓకే చెప్పడం, లేని వాటిని తిరస్కరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో చేసేది లేక రేటు ఎక్కువైనా పర్వాలేదని డాక్యుమెంట్ల రైటర్లు, వ్యాపారులు ఓ ఒప్పందానికి వచ్చినట్లు రి యల్ వ్యాపారుల్లో చర్చ నడుస్తోంది. గతంలో కంటే రూ.10వేలు అధికంగా ఇచ్చి, మొత్తంగా రూ. 40వేలకు ఓ డాక్యుమెంట్ చేసేందుకు ప్లాన్ వేసినట్లు ప్రచారంలో ఉంది. ఈ వ్యవహారమంతా లీక్ కావడంతో మళ్లీ ఆ లావాదేవీలు చేసేందుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ అధికారి విధుల్లో చేరేలోపే ఈ తతంగం చేసుకోవాలని కొందరు రియల్టర్లు పట్టుబట్టి ఉన్నారు. ఈ క్రమంలో వచ్చే పది రోజుల్లో ఏ మేరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయనేది వేచి చూడాలి.

ఇన్‌చార్జీలతో సతమతం..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూములు, ప్లాట్లు, నివాసాలు, వివాహాలు, సంస్థల రిజిస్ట్రేషన్లతోపాటు ఈసీ, స్టాంప్స్, లైసెన్స్‌లు, చిట్‌ఫండ్స్, తదితర మొత్తం 20రకాల సేవలు పొందవచ్చు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికంగా రియల్ లావాదేవీలే ఉంటాయి. మంచిర్యాల, లక్సెట్టిపేటలో గత కొంత కాలంగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు ఉండడం లేదు. విధుల్లో చేరి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్తున్నారు. దీంతో ఇన్‌చార్జీలతో కార్యకలాపాలు సాగుతున్నాయి. తాత్కాలికంగా విధులు నిర్వర్తించే అధికారులు ఒక్కొక్కరు ఒక్కో తీరుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో మంచిర్యాలలో పని చేసి వెళ్లిన ఓ సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఇన్‌చార్జి అధికారి నిబంధనలు తుంగలో తొక్కి డాక్యుమెంట్లు చేశారనే ఫిర్యాదులు వచ్చాయి. అంతేగాక కార్యాలయంలో ప్రైవేటు సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్ల హవా కొనసాగుతోంది.

అనుమతి లేనివే అధికం
డీటీసీపీ(డిస్ట్రిక్ టౌన్ కంట్రీ ప్లానింగ్) నుంచి ఆమోదం పొందిన లే ఔట్ల కన్నా అనధికారికంగా వెలిసిన వెంచర్లే జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. వ్యవసాయ భూములను కొనుగోలు చేసి చదును చేసి రూ.వందల కోట్లు పెట్టుబడి పెట్టిన వ్యాపారులంతా గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో అనేక చోట్ల అసైన్డ్, లావణి, వ్యవసాయ, ఇరిగేషన్ భూములు ఉన్నా ప్లాట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి. కానీ ఇటీవల కొంతకాలంగా పాత డాక్యుమెంటు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తూ కొత్తగా విభజించి ప్లాట్లు కావడం లేదు. దీంతో ఎలాగైనా తమ పని చేయించుకోవాలని ఉన్నతాధికారులు, రాష్ట్రంలో పలుకుబడి ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు తెచ్చినా పని కావడం లేదు. వందల కొద్దీ డాక్యుమెంటు దస్తావేజు లేఖర్ల టేబుళ్లపై పెండింగ్‌లో ఉన్నాయి.

నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్లు

ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా నిబంధనలు అతిక్రమించి చేయలేదు. ఎవరి నుంచీ డబ్బులు తీసుకోవడం లేదు. కొందరు చేసే ఆరోపణల్లో నిజం లేదు. డాక్యుమెంట్ రైటర్లది ప్రైవేటు వ్యవస్థ మా పరిధిలో ఉండదు.
– శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, మంచిర్యాల

హాల్టింగ్‌లు.. కొత్త రైళ్లు..!



మంచిర్యాల రైల్వేస్టేషన్


- ఉమ్మడి జిల్లా రైలు ప్రయాణికుల వేడుకోలు
- రైల్వేస్టేషన్లలో వెంటాడుతున్న అనేక సమస్యలు
- నేడు దక్షిణ మధ్య రైల్వే పరిధి ఎంపీలతో సమావేశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు పెంచాలి. మొదటి ప్లాట్‌ఫాం వైపే కాకుండా రెండువైపుల సౌకర్యాలు మెరుగుపర్చాలి. ఎస్కలేటర్లు, టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలి. మంచిర్యాల వంటి పెద్ద స్టేషన్లలోనూ ప్రయాణికులకు సరైన తాగునీరు సౌకర్యం ఉండడం లేదు. అపరిశుభ్ర నీటితో ఉంటున్నాయి. తాండూర్ మండలంలో ఫుట్ ఫ్లైఓవర్ నిర్మాణం పొడగింపు, రామగిరి రైలుకు హాల్ట్, మంచిర్యాల స్టేషన్ అమృత్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. డబ్లింగ్, ఆర్వోబీ పనులు పూర్తి చేయాల్సి ఉంది. గురువారం దక్షిణ మధ్య రైల్వే పరిధి ఎంపీలతో సమావేశం నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వాసులు ఆయా డిమాండ్లను నెరవేర్చాలని వేడుకుంటున్నారు.

ఇవీ డిమాండ్లు..
బల్లార్షా–కాజీపేట మధ్య నడిచే రైలును పునరుద్ధరించి.. నూతన చర్లపల్లి టెర్మినల్ వరకు పొడగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కాగజ్‌నగర్, పెద్దపల్లి దగ్గరలోని బసంత్‌నగర్ ప్రాంతాల్లో సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ మధ్య నూతన వందే మెట్రో ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు ప్రారంభించాలి.
- సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి తిరుపతికి నూతన సర్వీస్‌ను ప్రారంభించాలి.
- కాజీపేట–పెద్దపల్లి–మంచిర్యాల–సిర్పూర్ కాగజ్‌నగర్–బల్లార్షా జంక్షన్ల మీదుగా సికింద్రాబాద్ లేదా చర్లపల్లి నుంచి హౌరా కొల్‌కతాకు నూతన రైలు, అలాగే ఉదయం 9గంటలకు కాగజ్‌నగర్ నుంచి కాజీపేట వైపు, మధ్యాహ్నం 3:30గంటలకు కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వైపు, కాజీపేట నుంచి వయా పెద్దపల్లి–మంచిర్యాల–సిర్పూర్ కాగజ్‌నగర్–బల్లార్షా మీదుగా ఆదిలాబాద్ వరకు ప్రతీ రోజు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలి.
- మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో నాగపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలపాలి.
- ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫిట్ లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.
- బాసర రైల్వేస్టేషన్‌లో మూడు, నాలుగు ప్లాట్ ఫారాలు విస్తరించి ఇక్కడ నుంచి నూతన రైళ్లను నడపాలి. బాసర రైల్వేస్టేషన్‌లో అమరావతి నుంచి తిరుపతి బై వీక్లీ సూపర్ ఫాస్ట్, ఓఖా నుంచి రామేశ్వరం వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి

పూర్తి నివేదిక అందిస్తా..



పెద్దపల్లి పరిధిలో నూతన రైళ్ల నిలుపుదల, ప్రయాణికులకు సౌకర్యాల పెంపు, ఆర్వోబీల నిర్మాణం తదితర అన్నింటిపైనా అధికారులకు ఓ నివేదికను అందిస్తా. ఈ ప్రాంతంలో నెలకొన్న రైలు ప్రయాణికుల సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తాను.
– గడ్డం వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి

రేషన్ సరుకులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: చౌకధరల దుకాణాల ద్వారా లబ్దిదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఏఎస్‌వో వేణుతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రేషన్‌డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం, సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. దుకాణంలో లభించే సరుకులు, నిల్వలు, ధరల వివరాలు ప్రదర్శించాలని, రేషన్‌షాప్ నంబర్, చిరునామా, మొబైల్ నంబర్ నోటీస్ బోర్డులో ఉంచాలని తెలిపారు. సరుకుల పంపిణీ సమయంలో డీలర్ కచ్చితంగా ఉండాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలోని దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని తెలిపారు.

రెండు మిల్లులపై ఎఫ్ఐఆర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో 2022–23 ఖరీఫ్, యాసంగి వరి ధాన్యం సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. హాజీపూర్ మండలం దుర్గా రైస్‌మిల్లు, బెల్లంపల్లి మండలం మాతేశ్వరీ రైస్‌మిల్లులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సివిల్ సప్లయి అధికారులు తెలిపారు. రూ.కోట్లు విలువ చేసే ధాన్యం సీఎంఆర్ ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ సభ

- హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రాష్ట్రంలో మొదటి సభకు ఆదిలాబాద్ నుంచే శ్రీకారం



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: రైతుల సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో రైతన్నల కోసం రామన్నల పోరుబాట పేరిట బహిరంగ సభకు శ్రీకారం చుట్టింది. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల రైతులు, ప్రజలు పది వేలమంది ఈ సభకు హాజరయ్యేలా పార్టీ ముఖ్య నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి శంఖారావం పూరించాలని భావించిన బీఆర్‌ఎస్ పార్టీ సభ సక్సెస్ కోసం సర్వశక్తులు ఒడ్డుతోంది. పార్లమెంటు ఎన్నికల తర్వాత మొదటి సభ కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారు. పంట రుణమాఫీ కాకపోవడం, రైతు భరోసా పథకం అమలు చేయకపోవడమే ప్రధాన ఎజెండాగా పోరుకు సై అంటున్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అధ్యక్షతన జరిగే ఈ సభకు కేటీఆర్‌తోపాటు పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి మాజీ ఎంపీ బాల్క సుమన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొని పార్టీ క్యాడర్‌లో ఉత్తేజం నింపాలని యోచిస్తున్నారు. రైతుపోరుబాట కార్యక్రమ నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణం పూర్తిగా గులాబీమయమైంది.

పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- రామగుండం సీపీ శ్రీనివాసులు
- డీసీపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



ఏసీపీ ప్రకాష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ

మంచిర్యాలక్రైం: ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల(పోలీస్ ఫ్లాగ్ డే)ను పురస్కరించుకుని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పేదలకు సత్వర న్యాయం అందించడం, ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసినప్పుడే అమరుల త్యాగానికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రక్తదానం చేసిన ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, ఇతర సిబ్బందిని, స్వచ్ఛంద సంస్థలు, యువకులను అభినందించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. 100 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఆకుల అశోక్, నరేందర్, నరేష్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



రిజిష్టర్లు అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మంచిర్యాల జిల్లాలో వరంగల్–విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని నర్వ నుంచి టేకుమట్ల, ఎల్కంటి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల గ్రామాల మీదుగా నిర్మించనున్న వరంగల్ హైవే భూములను సందర్శించారు. రైతులు కోల్పోతున్న భూములు, రోడ్డు నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. భూ యజమానులు, రైతుల సమన్వయంతో ప్రక్రియ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో రాములు, తహసీల్దార్ వజనారెడ్డి ఉన్నారు.


వివరాలు నమోదు చేయాలి
మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆశా కార్యకర్తలు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను రిజిష్టర్లలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు, సేవల వివరాలను రిజిష్టర్లలో నమోదుపై సమీక్షించారు. జిల్లాలో 651మంది ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారని, వీరికి 3,515 రిజిష్టర్లు అందిస్తామని, 17 రకాల వైద్య సేవలపై వివరంగా ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అనిల్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం'

జన్నారం: రాజ్యాంగం ప్రకారం మాల ఉపకులాలు నేతకాని మహర్ కులాల రిజర్వేషన్ల కోసం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పాలకులు స్వలాభం కోసం మాల, మాదిగ ఉప కులాల మధ్య చిచ్చుపెట్టారని పేర్కొన్నారు. వర్గీకరణతో ఎంతో నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిని నియామకం చేశారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు నీలం రాజన్న, ఉపాధ్యక్షుడు అల్లాటి రాజన్న, ప్రధాన కార్యదర్శి కండ్లె దుబ్బయ్య, నాయకులు శ్రీకాంత్, సాగర్, సతీశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం పనులు షురూ

- వచ్చే ఏడాది హరితహారానికి సన్నద్ధం
- నెలాఖరు వరకు విత్తనాలు నాటే కార్యక్రమం పూర్తి



నర్సరీలో పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్(ఫైల్)

పాతమంచిర్యాల: జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో 2025–26 సంవత్సరం హరితహారానికి గాను నర్సరీల్లో మొక్కల పెంపకం మొదలైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఈ నెల మొదటి వారం నుంచి పనులు ప్రారంభించింది. సామగ్రి, బంకమట్టి, ఎర్రమట్టి, కంపోస్టు ఎరువు, ప్లాస్టిక్ కవర్లను సిద్ధం చేశారు. ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి విత్తనబెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది 36.50లక్షల మొక్కలు పెంచాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా నిర్ణయించిందని అధికారులు తెలిపారు. నర్సరీల్లో కూలీలతో విత్తన బెడ్‌ల తయారీ చేపట్టారు. చెరువుల నుంచి నల్లమట్టి తీసుకొచ్చి ఎండలో ఆరబెట్టి పౌడర్‌లా తయారు చేసి కంపోస్టు ఎరువు, ఎర్రమట్టి కలిపి ప్లాస్టిక్ కవర్లలో నింపుతున్నారు. మొక్కలు ఏపుగా పెరగడానికి నల్లమట్టి, కాంపోస్టు ఎరువు ఒక భాగం, రెండు భాగాలు ఎర్రమట్టిని సంచుల్లో నింపి ఉంచుతున్నారు. పంచాయతీల్లో ప్రజలకు ఉపయోగపడే మొక్కలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలు పెంచనున్నారు. కాగా, గత సంవత్సరం నాటకుండా ఉన్న మొక్కలు నర్సరీల్లో 1.13లక్షలు ఉండగా, వీటి సంరక్షణకు చర్యలు చేపడుతున్నారు.

ఈ విడత ప్రత్యేకం
ఈ విడత ప్రత్యేకంగా ప్రతీ నర్సరీలో ఈత, తాటి, వెదురు, నీలగిరి, ఖర్జూర, మునగ మొక్కలు పెంచాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్నీ కలిపి నాలుగు వేల మొక్కలు పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. విత్తన బెడ్‌ల తయారీ, విత్తనాలు నాటే కార్యక్రమం ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని అధికారులు నిర్దేశించగా.. నర్సరీల్లో కూలీలు బిజీగా ఉన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మండల స్థాయి అధికారులతో కలిసి ప్రతీ నర్సరీని పర్యవేక్షిస్తున్నాం. అన్ని నర్సరీల్లో ఎర్రమట్టి, చెరువుమట్టి, పశువుల ఎరువులు, కాంపోస్టు ఎరువుతో విత్తనపు బెడ్‌లు తయారయ్యాయి.
– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

క్లుప్తంగా

గిరిజన టీచర్‌కు ఘనంగా వీడ్కోలు



మెస్రం శేఖర్‌బాబును సాగనంపుతున్న గ్రామస్తులు

నార్నూర్: ఆయన ఎమ్మెల్యే కాదు.. ఎంపీ అంతకన్నా కాదు. ఓ ప్రభుత్వ టీచర్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. గాదిగూడ మండలం సాంగ్వి గ్రామంలోని ఎంపీపీఎస్‌లో 12 ఏళ్లుగా గిరిజన ఉపాధ్యాయుడు మెస్రం శేఖర్ బాబు విధులు నిర్వహించాడు. ఇటీవల అర్జుని గ్రామానికి బదిలీ అయ్యాడు. బుధవారం గ్రామ పటేల్ ఆర్కా హనుమంతరావు ఆధ్వర్యంలో ఆయనకు పూలమాల వేసి సత్కరించారు. ఆదివాసీ గిరిజన సంప్రదాయ ప్రకారం డప్పు, వాయిద్యాలతో ఆయన్ను సాగనంపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారంటూ గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మెస్రం లింగు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ మాడవి బాదిరావు, మాజీ ఉపసర్పంచ్ బాపురావు, మహిళలు పాల్గొన్నారు.

దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు

నెన్నెల: అత్త, బావమరిదిపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని శ్రావణ్‌పల్లికి చెందిన భుక్య చందు భార్య సునీతతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ విషయమై అడిగేందుకు అత్త రాజమ్మ, బావమరిది అజ్మీర రాజేష్, వదిన వసంతలు బుధవారం శ్రావణ్‌పల్లికి వెళ్లారు. ఈక్రమంలో చందు వారిపై కర్రతో కొట్టి గాయపర్చాడు. రాజమ్మ చేయి విరగగా, రాజేష్ తలకు గాయమైంది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

కారు తగులబెట్టిన వ్యక్తి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: కారు తగులబెట్టిన వ్యక్తిని బుధవారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని గాంధీ చౌక్‌కు చెందిన పుపాట్ అజయ్‌కుమార్ ఎప్పటిలాగే తన కారును ఈనెల 22న రాత్రి ఇంటి వద్ద పార్క్ చేసి నిద్రపోయాడు. తెల్లవారుజామున ఇంటి చుట్టుపక్కల వారు అజయ్‌కి ఫోన్‌చేసి కారు కాలిపోతున్నట్లు చెప్పారు. వచ్చి చూసే సరికి కారుతోపాటు పక్కనే ఉన్న ఐచర్ కాలిపోయాయి. బాధితుడు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. అదేకాలనీకి చెందిన బాధితుడి బాబాయి పుపాట్ మారుతి ఈ ఘటనకు ఒడిగట్టినట్లు గుర్తించారు. ఈమేరకు అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సోయా బస్తాల చోరీ

కుంటాల: మండలంలోని అందకూర్ శివారులో సోయా బస్తాలు మంగళవారం రాత్రి చోరీకి గురయ్యాయి. రైతు కన్నం సత్యం.. గ్రామశివారులో సోయాను ఆరబెట్టాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 11 బస్తాల (6.5 క్వింటాల్)ను ఎత్తుకెళ్లారని బాధిత రైతు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బెంబేలెత్తిస్తున్న బెబ్బులి

- నేరేడుపల్లెలో ఎద్దును చంపిన పులి
- చింతగూడలోకి ప్రవేశించిన టైగర్
- కేకలు వేయగా వెనుదిరిగిన వైనం
- పది గ్రామాల్లో హైఅలర్ట్



పులిదాడిలో హతమైన ఎద్దు



అడవిలో సంచరిస్తున్న పులి

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల వాసులను పులి బెంబేలెత్తిస్తుంది. మంగళవారం చింతలబోరి, వజ్జర్ అడవుల్లో సంచరించిన టైగర్ బుధవారం గొల్లాపూర్ మీదుగా చింతగూడకు చేరుకుంది. ఉదయం 7గంటల ప్రాంతంలో గ్రామస్తులకు కనిపించింది. వెంటనే వారు కేకలు వేయగా నేరేడుపల్లె వైపుగా వెళ్లింది. గ్రామ సమీపంలోని ఓ చేనులో ఉన్న ఎద్దుపై దాడి చేసింది. అక్కడే ఉన్న యజమాని వెంటనే పరిగెత్తాడు. స్థానికులతో కలిసి వచ్చి కేకలు వేయగా పులి వెళ్లిపోయింది. కాగా, అప్పటికే ఎద్దు మృతిచెంది కనిపించింది. సాయంత్రం రెండ్లపల్లె సమీపంలోకి పులి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష్మీపూర్ వైపుగా మళ్లిందని వివరించారు. అక్కడి నుంచి గొల్లాపూర్ లేదా జీడిపల్లె అటవీ ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో లక్ష్మీపూర్, గొల్లాపూర్, జీడిపల్లె, సాకెర, టివిటి, పరుపులపల్లెతో పాటు నిగిని, కంటెగాం, మర్లపల్లి గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవిలోకి వెళ్లవద్దని అధికారులు సూచిస్తున్నారు.

తిప్పేశ్వర్ నుంచి రాక..

గతేడాది ఇదే సీజన్‌లో బోథ్ అటవీ ప్రాంతానికి మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి పులి వచ్చినట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ ఏడాది కూడా అక్కడి నుంచి కిన్వట్, బొందిడి మీదుగా బోథ్‌కు వచ్చినట్లుగా భావిస్తున్నారు. కాగా, ఇప్పటికే తాంసీ, భీంపూర్ ,తలమడుగు మండలాల్లో పులి సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం పత్తి ఏరే సీజన్ కావడంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పర్యవేక్షిస్తున్న అధికారులు

మండలంలోని చింతలబోరి అటవీ ప్రాంతంలో పులి మంగళవారం కనిపించడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. దాని కదలికలపై దృష్టి సారించారు. బుధవారం ఉదయం చింతల్‌బోరి నుంచి గొల్లాపూర్ మీదుగా చింతగూడకు, అటు నుంచి నేరేడుపల్లె మీదుగా వెళ్లడంతో అధికారులు అడవిని జల్లెడ పడుతున్నారు. ట్రాప్ కెమెరాల ఆధారంగా దాని కదలికలపై దృష్టి సారించారు.

జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

- ఎంపీ గోడం నగేశ్
- ఉమ్మడి జిల్లా క్రీడాపోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు నిరుత్సాహం చెందవద్దన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి మాట్లాడుతూ క్రీడాకారులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలన్నారు. ఆర్సీఓ రాథోడ్ గోపీచంద్ మాట్లాడుతూ జిల్లాలోని జ్యోతిబాపూలే పాఠశాలలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 13 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని వెల్లడించారు. ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, క్యారం, చెస్, కబడ్డీ, పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించేలా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం



ద్వితీయ స్థానం సాధించిన శ్రీరాంపూర్ జట్టు

శ్రీరాంపూర్: కంపెనీ లెవల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీరాంపూర్ ఏరియా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. గోదావరిఖనిలోని జవహర్ లాల్ స్టేడియంలో రెండు రోజులుగా కంపెనీ లెవల్ పోటీలు జరిగాయి. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల జట్లు ప్రథమ స్థానం సాధించగా, శ్రీరాంపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఏరియా డబ్ల్యూపీఎస్, జీఏ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ అసిస్టెంట్ సెక్రెటరీ చాట్ల అశోక్‌లు జట్టు కెప్టెన్ టి.బాపు, సభ్యులను అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుభీర్ మండలం రంగాశివిని గ్రామానికి చెందిన హనుమంత్ (23) కూలీ పనిచేసుకుంటూ నిర్మల్‌లో జీవనం సాగిస్తున్నాడు. తండ్రి సాయన్న స్థానిక గాయత్రి టౌన్‌షిప్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి వద్ద ఉంటూ ప్రతీరోజు కూలీ పనికి వెళ్లి వచ్చేవాడు. రోజులాగే కూలీ వెళ్లినా హనుమంత్ మంగళవారం రాత్రి తండ్రి వద్దకు రాలేదు. అదే కాలనీలో ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. బుధవారం ఉదయం కాలనీవాసులు గమనించి తండ్రికి సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మల్‌లో వివాహిత..

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఉజ్మ బేగం(31) జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్ కాలనీకి చెందిన రహీంతో 2008లో వివాహమైంది. ఈయన ఆర్టీసీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈమెకు మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో భర్త ఆసుపత్రిలో వైద్యం చేయించినా నయం కాలేదు. మంగళవారం భర్త విధులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..

నస్పూర్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం.. పట్టణంలోని అల్లూరి సీతారామరాజునగర్‌కు చెందిన బుద్దె రాజు (45) టైలరింగ్ పని చేస్తూ భార్య లావణ్య, ఇద్దరు కూతుళ్లతో ఉంటున్నాడు. ఇటీవల కాలంలో భార్యతో మనస్పర్థలు వచ్చాయి. భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. మంగళవారం అతని కుటుంబ సభ్యులు రాజుకు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్లి చూడగా రాజు ఉరేసుకుని ఉన్నాడు. రాజు సోదరుడు సత్యం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరు..



గజానంద్ (ఫైల్)

గుడిహత్నూర్: అప్పుల బాధతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని నేరడిగొండతండాకు చెందిన ఆడే గజానంద్ (30) తనకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో మూడు ఎకరాలను కౌలు తీసుకుని వ్యవసాయం చేశాడు. అదేవిధంగా మండల కేంద్రంలో పాన్‌షాప్ నడుపుతున్నాడు. ఈక్రమంలో బ్యాంకు ద్వారా తీసుకున్న అప్పు రూ.3 లక్షలతోపాటు ప్రైవేట్ వ్యక్తుల వద్ద మరో రూ.3 లక్షలు తీసుకున్నాడు. అప్పులు చెల్లించే మార్గం లేక మనస్తాపం చెందాడు. బుధవారం గ్రామ సమీపంలో బైక్‌ను రోడ్డుపై ఉంచి పక్కనే ఉన్న స్థలంలో పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో గుర్తించిన స్థానికులు వెంటనే రిమ్స్ తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

ఫిట్స్‌తో వివాహిత మృతి



అనూష (ఫైల్)

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామానికి చెందిన వివాహిత ఆలం అనూష(24) ఫిట్స్‌తో బుధవారం మృతి చెందింది. ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో ఫిట్స్ రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త శ్రీకాంత్, మూడు నెలల వయస్సు పాప ఉంది. తల్లి మరణంతో పాల కోసం చిన్నారి ఏడుపు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట తిరుపతి, సాజిద్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..



ప్రమాద స్థలంలో బాలాజీ, క్లీనర్ సచిన్

గుడిహత్నూర్: ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన ముండే బాలాజీ దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బాలాజీ (34) తన డ్యూటీలో భాగంగా మంగళవారం వేకువజామున ఇంటి నుంచి బత్తాయి పండ్ల లోడ్‌తో ఐచర్ వాహనంలో అమరావతి మీదుగా చెన్నై బయల్దేరాడు. తిరుగుప్రయాణంలో సాయంత్రం ఒంగోలు వద్ద లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బాలాజీ నడుపుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీతోపాటు క్లీనర్ సచిన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వీరిని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలాజీ మృతి చెందగా, క్లీనర్ సచిన్ చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య అరుణ, కుమార్తె అనుష్క, కుమారుడు గణేశ్ ఉన్నారు.

వేంపల్లిలో ఒకరు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మద్దిరాల గ్రామానికి చెందిన మాటేటి శంకర్(39), వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన నడిమెట్ల పోచంలు మంచిర్యాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మీదుగా వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. వేంపల్లి వరకు వెళ్లగా మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్, పోచంలకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శంకర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోచంను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి..



రాజన్న మృతదేహం

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన తుమ్మ రాజన్న (44) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ సమీపంలో తనకు ఉన్న రెండెకరాల్లో వరి సాగు చేసి మోటారుతో నీటిని అందిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన రాజన్న మోటారు ఆన్ చేయగా విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూడగ మృతి చెంది ఉన్నాడు. ఎస్సై సతీశ్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దుబాయిలో మల్లాపూర్ వాసి మృతి



గణేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆకుల గణేశ్ (24) దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. గత రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లి కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం పనిచేసే చోట గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గణేశ్ మిత్రులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు రాత్రి సమాచారం అందజేశారు. కుటుంబీకులు రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి ప్రభుత్వం తెప్పించాలని కోరుతున్నారు. మృతుడికి భార్య జయశ్రీ, కుమారుడు సాత్విక్ (3) ఉన్నారు.

జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి



విజయలక్ష్మి జిన్నింగ్ మిల్లును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మట్

ఇంద్రవెల్లి: త్వరలో పత్తి కొనుగోళ్ల నేపథ్యంలో జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మట్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని విజయలక్ష్మి, మిథల్, ఐఎఫ్‌పీసీఎల్ జిన్నింగ్ మిల్లులను పరిశీలించారు. మిల్లుల్లో ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. పత్తి పంట విక్రయించడానికి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నిర్వాహకులు ఉన్నారు.

భార్యపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న నవనీత

నిర్మల్‌టౌన్: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. తానూర్ మండలానికి చెందిన నవనీత -గోవింద్ దంపతులు గత ఆరునెలలుగా జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో ఉంటున్నారు. భార్య నవనీత.. డాక్టర్స్ లైన్‌లో ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తోంది. భర్త కూలీ పని చేస్తూ.. మద్యానికి బానిసయ్యాడు. దీంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈక్రమంలో మంగళవారం రాత్రి గొడవ జరగగా భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లిందని తెలుసుకున్న భర్త అక్కడికి వెళ్లి ఆమెతో గొడవ పెట్టుకున్నా డు. మాటమాట పెరిగి వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె ఛాతి, వీపులో పొడిచాడు. తీవ్ర గాయాలైన ఆమెను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించా రు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదుతో భర్తపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.

చోరీ చేస్తూ విద్యుదాఘాతానికి గురై..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన గోలివాడ చంద్రయ్య చోరీకి పాల్పడుతూ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ముల్కల్లలోని గంగపుత్ర కాలనీకి చెందిన గోలివాడ చంద్రయ్య మంగళవారం ముల్కల్ల శివారులో విద్యుత్ సరఫరా లేని ఓ వైర్‌ను చోరీ చేసేందుకు వెళ్లాడు. అప్పటికే అల్యూమినీయం వైర్‌ను కట్ చేసి చుడుతున్న క్రమంలో ఆ వైర్ చివరన విద్యుత్ సరఫరా అయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చంద్రయ్య మంటలతో రోడ్డు వరకు వచ్చి పడిపోగా స్థానికులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హాజీపూర్ పోలీసులు, విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టగా దొంగతనం జరిగినట్లు తేలింది. చంద్రయ్య వాహనం, వైర్ కట్ చేసేందుకు ఉపయోగించిన వస్తువులు అక్కడ లభించగా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై హాజీపూర్ ఎస్సై సురేశ్‌కు గురువారం ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ మహేందర్‌రెడ్డి తెలిపారు.

ఆర్జీయూకేటీలో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

బాసర: ఆర్జీయూకేటీలో బుధవారం తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచీకరణ ప్రభావం-గణిత శాస్త్ర సవాళ్లు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ఆదేశానుసారం గణిత శాస్త్ర నిపుణులు, ఆచార్యులతో కలిసి ఆర్జీయూకేటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్సాగి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రం నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే పరిష్కార మార్గాలను వెలికితీస్తుందన్నారు. ప్రధానంగా వాతావరణ నమూనాలను అర్థం చేసుకోవడంలో ఇంజినీరింగ్ విద్యలో గణిత శాస్త్ర పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. వైఎస్.రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాలలో మాత్రికల ప్రాముఖ్యత, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, గ్రాఫ్ థియరీలో దీని ఉపయోగాలు, ఫినిట్ డిఫరెన్స్ మెథడ్ థామస్ అల్గోరిథం ఉపయోగించిన తీరును ప్రస్తావించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కే.సత్యనారాయణ, సమన్వయకర్త జి.తిరుపతి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, డాక్టర్ చంద్రశేఖర్, మహేష్, అధ్యాపకులు సునీల్ కుమార్, డాక్టర్ కుమార్ రాగుల, బాలరాజు, సత్తన్న, సాయన్న, ప్రకాష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు అనుమతి ఇవ్వాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- పీసీసీఎఫ్ ఆర్ఎం డొబ్రియాల్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం, ఉట్నూర్, ఖానాపూర్ అటవీ డివిజన్ల మధ్య భారీ వాహనాల రాకపోకల పునరుద్ధరణకు అనుమతి ఇవ్వాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు కోరారు. బుధవారం మండల నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) ఆర్ఎం డొబ్రియాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టైగర్‌జోన్‌లోని సమస్యలపై డొబ్రియాల్‌తో ఎమ్మెల్యే చర్చించారు. వాహనాల రాకపోకల విషయంలో స్థానికుల వద్ద ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నారని, ఇది మినహాయింపు ఇస్తూ పాసులు జారీ చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కడెం ప్రధాన కెనాల్ మరమ్మతు, కాలువ మధ్యలో అటవీప్రాంతంలో గల వంతెన శిథిలావస్థకు చేరిందన్నారు. వంతెన నిర్మాణం, అటవీ గ్రామాల అభివృద్ధి పనుల గురించి అనుమతి ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మండల నాయకులు రాజశేఖర్, సయ్యద్ ఇసాక్ ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థికసాయం

- ఉమ్మడి జిల్లాకు రూ.90లక్షలు విడుదల

కైలాస్‌నగర్: గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న రాష్ట్రానికి చెందిన కార్మికులు అక్కడ ఏ కారణంతో మరణించినా వారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉ మ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.90లక్షల నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఏ.శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నిర్మల్ జిల్లాకు రూ.50లక్షలు విడుదల చేయగా, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు రూ.20లక్షల చొప్పున ప్ర భుత్వం కేటాయించింది. ఆయా జిల్లాల కలెక్టర్లు అర్హులైన వారిని గుర్తించి ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నట్‌లైతే వారి వివరాలతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని పేర్కొన్నారు. ప్ర భుత్వ నిర్ణయంతో మూడు జిల్లాల పరిధిలోని 18 మంది కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

మెడికల్ రిపోర్టుల పరిశీలన



ఉద్యోగి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న 10 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల భర్తీ కోసం అధికారులు స్క్రీనింగ్ నిర్వహించారు. మెడికల్ గ్రౌండ్‌లో వీటిని దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. ఫ్యాక్చర్ ఉంటే ఎక్స్ రే, ఇతర గాయాలుంటే మెడికల్ రిపోర్టులను వైద్య అధికారులు పరిశీలించారు. మొత్తం 432 మంది దరఖాస్తు చేసుకోగా బుధ, గురు, శుక్ర వారాల్లో ఈ స్క్రీనింగ్ జరగనుంది. గాయాలు, ఫ్యాక్చర్ తీవ్రతను బట్టి ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఏరియా ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్‌బాబు, వైద్య నిపుణులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో ముందుకు రావాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీసులు ఆపద సమయంలో ప్రాణదాతలుగా ముందుకు రావాలని బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో తలసేమియా, రక్తహీనతతోపాటు వివిధ ప్రమాదాల్లో రక్తం అవసరమైన వారికి రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇలాంటి సమయాల్లో సిబ్బంది రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, మెడికల్ అధికారి సంతోశ్‌సింగ్, మంచిర్యాల వలంటరీ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ప్రేమ్ పాల్గొన్నారు.

ఏమయ్యాడు..?

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలోని జ్యువెల్లరి దుకాణంలో పని చేసే ఠాకూర్ కిరణ్‌సింగ్(27) అదృశ్యం మిస్టరీగా మారింది. మాయమయ్యాడా.. ఎవరైనా మాయం చేశారా అనే చర్చ జరుగుతోంది. ఈ విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఠాకూర్ కిరణ్ సింగ్ తండ్రి బాలాజి తెలిపిన వివరాలు.. హమాలీవాడకు చెందిన కిరణ్‌సింగ్ మార్కెట్ రోడ్డులోని లక్ష్మీనారాయణ జ్యువెల్లరి దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 17న యజమాని తమ్ముడు సంతోష్ రూ.47లక్షలు డబ్బులు ఇచ్చి దుకాణం పనిపై రైల్లో చెన్నయ్ పంపించాడు. కిరణ్ ఇంటికి రాకపోవడంతో తండ్రి బా లాజి యజమానిని అడిగి తెలుసుకున్నాడు. ఈనెల 18న కిరణ్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వ్యక్తం చేస్తూ 19న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుకాణ యజమానులు ఆలస్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.